# మౌనగీతం

రమణి డ్రెస్సింగ్ టేబిల్ ముందు నిల్చుని అందానికి తుదిమెరుగులు దిద్దుకుంటోంది. టొమాటోరెడ్ కలర్ చీర, మాచింగ్ బ్లౌజ్, ఎర్రటి గాజులూ, కంఠాన్ని కౌగిలించుకున్నట్లుగా ఉన్న పగడాల దండతో తన అందం తనకే ముద్దొచ్చేటట్లుగా అన్పించి, రమణి ఎర్రటి పెదవులపై చిరునవ్వు కదలాడింది. తలంటుకుని, వదులుగా వేసుకున్న జడలో కనకాంబరాల మాల తురుముకుంటుండగా, కాలింగ్ బెల్ మోగింది.

"ఆయన వచ్చినట్లున్నారు" అనుకుంటూ వీధి గుమ్మం వైపు పరుగెత్తి, తలుపు తీసింది రమణి.

అలసటగా లోపల అడుగు పెడుతున్న భర్త చేతిలో నుంచి బ్రీఫ్‌కేస్ అందుకుని వెనక్కి తిరిగిందామె. భార్యను చూడగానే రాకేష్ ముఖంలో అలసట మాయమైన సంగతి ఆమెకు కన్పించలేదు.

"కాఫీ ఇమ్మంటారా? అడిగింది రమణి. రాకేష్ టైం చూసి "బాగా ఆలస్యమైన ట్లుందిగా. డైరెక్ట్‌గా డిన్నర్ తీసుకుంటేనే మంచిదేమో. స్నానం చేసేస్తాను" అన్నాడు.

అతను స్నానం చేసి వచ్చేలోగా, డైనింగ్ టేబుల్ మీద ఆమె ప్లేట్లు, గ్లాసులు, కాసిరోల్స్ తీసుకొచ్చి పెట్టింది. స్నానం చేసి, తెల్లటి పైజమా, లాల్చీలో ఉన్న భర్తను చూసి "చాలా అందంగా ఉంటారీయన" అనుకుందామె.

రాకేష్ మౌనంగా కాసిరోల్ మూత తీసి ఆమె ప్లేట్లో రెండు చపాతీలు వేసి, తన ప్లేట్లో రెండు వేసుకున్నాడు.

ఆమె 'ఈరోజు చనామసాలా, వెజిటబుల్ మెకరోనీ స్ట్యూ చేశాను' అంటూ అతని ప్లేట్లో వడ్డించింది.

ఇద్దరూ మౌనంగా తింటున్నారు. అతను స్ట్యూ మరికొంచెం వేసుకున్నాడు.

"ఈరోజే మొదటిసారి ఎక్స్‌పెరిమెంట్‌గా చేశాను. బాగుందా? ఉప్పూ, మసాలా సరిపోయాయా?" అడిగిందామె.

అతను ఇంకొక చపాతీని తీసుకుంటూ "బాగుంది" అన్నాడు.

ఒక్కసారైనా బాగుందని నేను అడక్కుండా చెప్పకూడదా అనుకుంది రమణి.

భోజనాలయ్యాక టేబిల్ క్లియర్ చేస్తున్నప్పుడు స్ట్యూ ఉన్న కాసిరోల్ ఖాళీగా కన్పించింది. "రేపటి బ్రేక్‌ఫాస్ట్‌కి కూడా ఉంటుందనుకుని ఎక్కువ చేశానే. ఆయనకు

చాలా నచ్చినట్లుంది" అనుకుంది రమణి. తను చేసిన మెకరోనీ స్వీట్ భర్తకి నచ్చిన విషయం ఆమె మనసులో ఎక్కడో ఒక మూల ఆనందాన్ని మెరిపించింది.

❖ ❖ ❖

రమణి వంటిల్లు సర్దుకుని వచ్చేసరికి రాకేష్ టి.వి.లో న్యూస్ చూస్తున్నాడు. ఆమె అతని పక్కనే కూర్చుని. "మన పక్క పోర్షన్ ఖాళీ అయిందిగా. ఫస్ట్ నుంచి రెంట్‌కి వస్తున్నారట. ఈ రోజే ఓనర్ వచ్చి చెప్పేరు" అంది.

"ఎవరు వస్తున్నారు?"

"గవర్నమెంట్ కాలేజీలో లెక్చరర్ ఎవరో ట్రాన్స్‌ఫర్ అయి ఈ ఊరు వచ్చారట. సంస్కృతం లెక్చరర్‌ట. పాతకాలం వాళ్ళలా ఉంటారేమో?"

"ఏ లెక్చరర్ అయితే ఏమిటి? మాథమేటిక్స్ చెప్పినా, సాంస్క్రిట్ చెప్పినా జీతమొకటే ఇస్తారు" రమణి "ఇప్పుడు జీతం విషయం ఎందుకు" అనుకుంది విసుగ్గా. పైకి మాత్రం "ఓనర్ మీకు సారీ చెప్పమన్నారు. లెక్చరర్ని కుటుంబం విషయాలడిగితే భార్య, ఇద్దరు పిల్లలు అని చెప్పేడుట. అందరూ ఉంటారు కాబోలు ననుకుని ఓనర్ అడ్వాన్స్ తీసుకున్నారు. ఆ తరువాత ఆయన భార్య కాకినాడలో జాబ్ చేస్తోందనీ, ఈయన ఒక్కడే ఇక్కడ ఉంటాడనీ తెలిసింది. కాలేజీ లెక్చరర్ల జీతాలు బాగానే ఉంటాయిగా. మొగుణ్ణి ఒంటరిగా వదిలి జాబ్ చెయ్యాల్సిన అవసరమేమిటో?"

రాకేష్ మాట్లాడలేదు. టి.వి. చూస్తున్న భర్తను చూసి కోపంగా పెదవులు కొరుక్కుంది రమణి.

❖ ❖ ❖

రాత్రి భర్త పక్కన పడుకుంటూ "ఎర్రచీర ఈ మధ్యనే కొనుక్కున్నాను. ఈ రోజే కట్టుకున్నాను. బాగుందా? అంది రమణి. రాకేష్ "బాగుంది" అన్నాడు.

అరగంట తరువాత ఆనందంగా, అలసటగా భర్త గుండెలమీద తల పెట్టుకుని పడుకుంది రమణి. ఆమె కళ్ళు తన్మయత్వంతో మూసుకుని పోయాయి. రాకేష్ ఆమె శరీరాన్ని నెమ్మదిగా నిమురుతున్నాడు. మెల్లిగా నిద్రలోకి జారుకుంటున్న ఆమె ఆనందభరిత హృదయంలో అసంతృప్తి వీచిక కదలాడింది. "ఒక్కసారంటే ఒక్కసారైనా భర్త నీతో గడిపిన సమయం ఆనందంగా ఉందనో, నీవంటి అందగత్తె దొరకడం నా అదృష్టమనో అనకూడదా?" వివాహానికి ముందు చాలా మంది "నువ్వు చాలా

అందంగా ఉంటావు. నిన్ను చేసుకునేవాడు అదృష్టవంతుడు" అనేవారు. కానీ భర్తనోట్లోంచి ఎప్పడూ ఆమాట రాదెందుకో. ఏ విషయంలోనూ చిన్న మెచ్చుకోలు మాట ఏనాడూ అనరేమిటో. నోరు తెరిచి వంట బాగుందా అని అడిగితే బాగుంది అంటారు. ఈ విషయంలో ఎలా అడగడం అర్ యు హాపీ విత్ మి అని అడిగితే ఎంత సిగ్గుగా ఉంటుంది?

రమణి ఆలోచనలు ప్రవాహంలా సాగిపోతున్నాయి. రాకేష్ ఆమె శరీరాన్ని నిమురుతూనే ఉన్నాడు. భర్త చేతి స్పర్శ ఆమె సంతప్త హృదయానికి ఊరటనిచ్చింది.

❖ ❖ ❖

"పక్క పోర్షన్లో ఆయన నిన్న రాత్రి దిగినట్లున్నాడు. పొద్దుటే ఇబ్బంది పడతారేమో. కొంచెం టిఫిన్ ఆయనకు తీసుకెళ్ళి ఇస్తారా" అడిగింది రమణి భర్తను.

"అలాగే" అంటూ పక్క పోర్షన్‌కి వెళ్ళి, తిరిగి వస్తూ "ఆయన పేరు శ్రీనాథ్‌ట. సాంస్క్రిట్ లెక్చరర్ అంటే పాతకాలం డ్రెస్‌లో ఉంటాడనుకున్నాను. నా ఈడు వాడే. పాంటూ, షర్టునే వేసుకున్నాడు" అన్నాడు రాకేష్.

పదకొండు గంటలకు కాలింగ్ బెల్ చప్పుడుకు తలుపు తీసింది రమణి. ఎదురుగా నిల్చున్నది ఎవరో ఆమెకు తెలియలేదు.

"నమస్తే మేడమ్. నేను పక్క పోర్షన్లో అద్దెకు దిగాను. ప్రొద్దుటే మీవారు వచ్చారు. మీ టిఫిన్ బాక్స్ తిరిగి ఇచ్చేద్దామని వచ్చాను. చాలా థాంక్సండీ మీది అమృతహస్త మనుకుంటాను. ఇడ్లీలు వెన్నలా ఉన్నాయి. కొబ్బరి చట్నీ చాలా బాగుంది.' తన వంటను గురించిన పొగడ్త రమణికి ఎంతో ఆనందాన్నిచ్చింది.

❖ ❖ ❖

శ్రీనాథ్‌ని చూస్తే "కాలేజీ లెక్చరర్ ఉద్యోగం ఎంతో హాయి" అన్పించేది రమణికి. ఎందుకో ఒకందుకు కాలేజీకి సెలవులిస్తూనే ఉండేవారు. ఒకసారి స్టూడెంట్స్ స్ట్రయిక్, ఒకసారి లెక్చరర్ల్ స్ట్రయిక్ ఏదో ఒక రాజకీయ పార్టీ బంద్, ఎప్పుడు చూసినా అతను ఇంట్లోనే ఉంటున్నాడు అనుకునేది రమణి.

ఎక్కువ తీరిక దొరకడం వల్ల శ్రీనాథ్ రమణితో కబుర్లు చెప్తూ కూచునేవాడు. సినిమాల గురించీ, నవలల గురించీ, కవిత్వం గురించీ మాటలు వాళ్ళ మధ్య దొర్లుతూ ఉండేవి.

❖ ❖ ❖

గేటు తీసుకుని లోపలకు వస్తూ శ్రీనాథ్ "ఏమండీ రమణిగారూ, మీవారు ఇంకా రాలేదా" అన్నాడు.

"లేదండీ ఆయన వచ్చేసరికి కొంచెం లేటవుతుంది" అందామె.

శ్రీనాథ్ తన పోర్షన్లోకి వెళ్ళకుండా ఆమెకు ఎదురుగా కూర్చున్నాడు. రమణి పుస్తకం మూసేసింది.

"మీకు కోపం వస్తుందేమో తెలియదు. చనువు కొద్ది అనుకుంటున్నాను. ఏమీ అనుకోకండి. గులాబీరంగు చీర మీ వంటి చాయకు సరిపోయింది. మిమ్మల్ని చూస్తుంటే గులాబీలు రాశిపోసినట్లున్నారు".

రమణి గుండె ఝల్లుమంది. ఆమెకు అర్థం కాని పులకింత పాదాల నుంచి శిరస్సు దాకా కదలాడింది. ఎన్ని రోజులయింది తన అందాన్ని గురించి ఒక్క మంచి మాట విని.

"ఏమండీ మీకు కోపం వచ్చినట్లుంది. సారీ" అన్నాడు శ్రీనాథ్.

"అబ్బే కోపం లేదండీ" మెల్లిగా అంది రమణి. తన కంఠంలోని కంపనాలు అతనికి తెలిసి ఉంటాయా అనుకుందామె.

శ్రీనాథ్ "మీరు సాంస్క్రిట్ లాంగ్వేజ్ చదివి ఉండరు. మహాకవి కాళిదాసు తన కావ్య నాయికను వర్ణిస్తూ యువతి విషయే సృష్టి రాద్యేవ ధాతు: అన్నాడు. స్త్రీ విషయంలో బ్రహ్మ సృష్టిలో మొదటిదిగా చెప్పవచ్చునట. మిమ్మల్ని చూసినా అలాగే అన్పిస్తుంది" అన్నాడు.

రమణిలో ఆమె ఎన్నడూ ఊహించనంతగా ప్రేమ తరంగాలు కదలాడేయి. ఆమె తనను తాను నిగ్రహించుకుంటూ "పని ఉంది" అంటూ లోపలకు వెళ్ళిపోయింది.

❖ ❖ ❖

మధ్యాహ్నం రమణి పడుకుని ఆలోచిస్తోంది. ఎదురుగా ఉన్న అద్దంలో ఆమె ప్రతిబింబం కన్పిస్తోంది. తన అందమైన ముఖాన్ని కానీ, అవయవ సౌష్ఠవాన్ని కానీ తన భర్త ఒక్కసారీ మెచ్చుకోడేమిటి? మామూలుగా మాట్లాడకపోతే పోనీ, ఆ మధురక్షణాలలోనైనా ఒక్క మంచిమాట తన అందం గురించి చెప్తే తనకు కలిగే ఆనందం రెట్టింపవదా?

రమణి అద్దంలో తనను తాను చూసుకుని దీర్ఘంగా నిట్టూర్చింది. తెల్లని చీర, జాకెట్టులో ఉన్న తనను చూడగానే ఏమనిపిస్తుంది ఎవరికైనా? ఆమెకా క్షణంలో

శ్రీనాథ్ జ్ఞాపకం వచ్చాడు. ఇప్పుడు తనను చూస్తే ఏమంటాడు? మల్లెలు రాసిపోసినట్లుంది అంటాడా, పాలసముద్రంలో లక్ష్మీదేవిలా ఉన్నారంటాడా?

కాలింగ్‌బెల్ మోగింది. రమణి తలుపు తీసింది ఎదురుగా శ్రీనాథ్.

"స్టూడెంట్స్‌కీ, ప్రిన్సిపాల్‌కీ ఏదో గొడవయి కాలేజీ మూసేశారు. ఇంట్లో మంచి నీళ్ళు లేవు. కొంచెం ఇస్తారేమోనని వచ్చాను. నిద్రపోతున్నారేమో. సారీ. డిస్టర్బ్ చేసినట్లున్నాను".

"అబ్బే లేదు. కూచోండి. నీళ్ళు తెస్తాను."

రమణి వంటింట్లోకి వెళ్ళి, జగ్‌తో నీళ్ళు తెచ్చి టీపాయ్ మీద పెట్టింది.

"మల్లె తీగ నడిచిదంటే అని ఏదో ఒక పాత సినిమా పాట ఉండాలి. మీరు నడిచి వస్తుంటే ఆపాటే జ్ఞాపకం వచ్చింది".

రమణిలో కోటి కోరికలు కదలాడేయి. ఒక్కసారైనా తన అందాన్ని గురించి ఒక్క మంచి మాట కూడా చెప్పని భర్త మీద కోపం ఆమెలో కోరికలను రెట్టింపు చేసింది. ఆమెలో వివేకమూ, విచక్షణా పూర్తిగా అడుక్కి పోయాయి.

రమణి తన్మయత్వంతో కళ్ళు మూసుకుంది. మధురస్వప్నం నిజం కాబోతున్నదన్న ఆనందం ఆమెలో తరంగాలుగా సాగిపోతోంది. ఏం చేస్తాడిప్పుడు శ్రీనాథ్. తన ప్రతి అంగాన్నీ స్పృశిస్తూ అత్యంత రమణీయంగా వర్ణిస్తాడా? తన పెదవులను ముద్దాడుతూ, మందార మొగ్గలంటాడా? తన చెంపలు కెంపులయ్యేయంటాడా? మెడ చుట్టూ చేతులు వేసి శంఖంలా ఉందంటాడా?

తన్మయత్వంతో ఉన్న రమణి కాళ్ళకి ఏదో తగిలినట్లయి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది. శ్రీనాథ్ ఒక చేత్తో ఆమె చీరను పైకి తీస్తూ, రెండో చేత్తో పాంటు జిప్ విప్పుకుంటున్నాడు.

రమణి ఒక్కమారుగా లేవబోయింది. అతడామెను బలవంతంగా ఆక్రమించ బోయాడు. రమణి బలంగా అతన్ని తోసేసి, లేచి కూచుంది.

"మీరేగా కావాలని అడిగింది?" కోపంగా ఉన్నాయి అతని మాటలు.

ఏమిటి తను కావాలని అడిగింది. రెండు నిముషాలలో పూర్తిచేసే సృష్టి కార్యమా? రమణి మనస్సులోని భావాలను రుద్ధమైన ఆమె కంఠం మాటలుగా మార్చలేక పోయింది.

ఆమె మౌనం అతనిలోని కోపాన్ని రెట్టింపు చేసింది. అతనిలో ఆవేశం కట్టలు తెంచుకుని వాక్ప్రవాహంగా మారింది.

“కోరిక చూపిస్తూ కవ్వించనూ గలరు. దగ్గరకు వచ్చాక హఠాత్తుగా తోసెయ్యనూ గలరు. మీ ఆడవాళ్ళని అర్థం చేసుకోవడం సాధ్యమయ్యేపనేనా? ఆడవాళ్ళ మాటలకి అర్థాలే వేరులే అన్నాడు కవిగారు. ఆ సంగతి మర్చిపోయి నేనే ఫూల్ నయ్యాను.”

ఇదా ఇతనికి స్త్రీ మీద అభిప్రాయం. మగువను మురిపించే పద్ధతి తెలియదా? వీణలా శ్రుతి చేసుకుని, వెన్నలా కరిగించాలని అనుకోడా? తన మాటలతో, చేతలతో ఎంతగానో రంజింపచేస్తాడనుకుందే? పశువులా మీదపడడమేనా ఇతనికి వచ్చిన విద్య? మీద పడకుండా అడ్డుకున్నందుకేనా ఇంత ఆగ్రహం?

రమణి నిరాశతో కుంగిపోయింది.

ఆఖరు క్షణంలో కాదన్నదన్న రోషం అతనిలో పొంగిపోయింది.

“ఒక్క క్షణం కూడా ఇక్కడ ఉండకూడదు. కవ్వించి, రేప్ కేస్ పెట్టగల శక్తి మీ ఆడవాళ్ళకే ఉంది”.

అతను విసురుగా వీధి తలుపు చప్పుడు చేస్తూ వెళ్ళిపోయాడు.

రమణి నిస్సారంగా సోఫాలో పడుకుండిపోయింది.

ఎంత తియ్యగా మాట్లాడేవాడు? ఎంత చక్కగా తన అందాన్ని పొగిడేవాడు? డ్రెస్ చేసుకుని ఉన్నప్పుడే తనను మాటలతో మురిపించినవాడు ఏకాంత సమయంలో ఇంకెంత అలరిస్తాడోనని తను ఎంతగా ఆశపడింది? అతని మాటలు అతనికి భాషమీదా, కావ్యాలమీదా ఉన్న కమాండ్‌కే నిదర్శనమన్నమాట. ఒక మగవాడిలా ప్రవర్తించవలసి వచ్చేసరికి పశువులాగే ఉన్నాడు.

ఆ క్షణంలోనే ఆమెకు భర్త చూసే అనురాగం జ్ఞాపకం వచ్చింది. తన పెదవులు అందంగా ఉన్నాయని పదిసార్లు చెప్పడం ఆనందమా లేక తనివితీరా ముద్దాడడం ఆనందమా? ఆమెకు భర్త మధురాధర స్పర్శ మదిలో మెదిలింది. తన అందానికి నీరాజనమివ్వాల్సింది కబుర్లతో కాదు, కమ్మని కౌగిలింతలతో.

ఈ నిజం తెలుసుకోవడానికి తను శీలం కోల్పోయే పరిస్థితి కూడా ఏర్పడింది.

రమణి కన్నీళ్ళు ఆమె మనస్సులోని అసంతృప్తి కల్మషాన్ని కడిగివేస్తున్నాయి.

(ఆంధ్రభూమి వీక్లీ)